టీ-మీడియా

Digital, tmedia.net.in

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

TMEDIA 11వ వార్షికోత్సవం 2016 - 2026 మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

సోమవారం 12/10/2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

సీజేపీ నిరసనకారులపై 'హిందూ రక్షా దళ్'

వ్యక్తులు దాడి.. నలుగురు అరెస్ట్



టి మీడియా , అక్టోబర్ 11, ఢిల్లీ బ్యూరో : దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల సందర్భంగా హిందూ రక్షా దళ్‌కు చెందిన వ్యక్తులు చెలరేగిపోయారు. యువతీ, యువకులపై వారు దాడికి పాల్పడ్డారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం

➤ మిగతా 2వ పేజీలో..



ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించండి


సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

టి మీడియా , అక్టోబర్ 11, ఢిల్లీ బ్యూరో : దిల్లీలో సీజేపీ నిరసనలను అడ్డుకునేందుకు పోలీసులు చేపట్టిన కట్టడి చర్యలపై పలువురు న్యాయవాదులు దాఖలు చేసిన పిటిషన్?పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. దిల్లీలో ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు ఈ పిటిషన్ విషయంలో తాము అన్ని పక్షాల వాదనలు పూర్తిగా వింటామని, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం లేకుండా చూస్తామని అత్యున్నత ధర్మాసనం

➤ మిగతా 2వ పేజీలో..

పేదలకు అండగా ఉన్నాం

సీఎం చంద్రబాబు



టి మీడియా, అక్టోబర్ 11,నెల్లూరు : ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటున్న పేదలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా సర్వేపల్లి కట్ట ప్రాంతంలోని పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ, కలెక్టర్ హిమాంశు శుక్లా పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. రూ.600 కోట్ల విలువైన ఆస్తిపై 939 పేద కుటుంబాలకు శాశ్వత హక్కులు కల్పించారు. ముమ్మందు జాఫర్ సాహెబ్ కెనాల్ ప్రాంత వాసులకు కూడా పట్టాలు ఇస్తామని, అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను త్వరలో పూర్తి చేసి అప్పగిస్తామని ఈ సందర్భంగా మంత్రి నారాయణ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం తమ సొంతింటి కలను సాకారం చేసిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.సంక్రాంతికి మరో 4 వేల మందికి : సుపరిపాలనలో భాగంగా రాష్ట్రమంతా ఒక ఉద్యమంలా పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్నామని సీఎం తెలిపారు. విశాఖ, విజయవాడ, మంగళగిరిలో ఇప్పటికే ఈ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. వచ్చే సంక్రాంతి నాటికి నెల్లూరులో మరో 4 వేల మందికి పట్టాలు ఇస్తామన్నారు. బుర్రిపాలెం నుంచి 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని, ఇప్పటికే 5.50 లక్షల ఇళ్లు అందించామని గుర్తు చేశారు. ఇంటి స్థలాలతో పాటు ఇంటర్నెట్, రోడ్లు, డ్రైనేజీలు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కోసం రూ.1.80 లక్షల కోట్లు, ఇంటింటికీ కుళాయిల కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. 'గొడ్డలి పార్టీ' హయాంలో డబ్బులు

➤ మిగతా 2వ పేజీలో..



విమానంలో మంటలు..

శంషాబాద్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్

టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో: ఢిల్లీ–చెన్నై విమానాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో శంషాబాద్‌లో విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. అందిన వివరాల ప్రకారం, ఢిల్లీ నుంచి చెన్నై వెళ్తున్న విమానంలో ఓ ప్రయాణికుడికి చెందిన పవర్ బ్యాంక్ నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఈ పరిణామంతో విమానంలో కలకలం రేగింది. పరిస్థితిని గుర్తించిన

➤ మిగతా 2వ పేజీలో..



కస్టమర్ల కళ్లముందే వంట తయారీ..

ఇకపై రెస్టారెంట్ కిచెన్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి!

టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతను మరింత మెరుగుపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు రెస్టారెంట్లలో తయారైన ఆహారాన్ని మాత్రమే చూస్తున్న వినియోగదారులు.. ఇకపై వంటగదిలో ఆహారం ఎలా సిద్ధమవుతుందో తెలుసుకునే అవకాశం రానుంది. ఇందుకోసం రెస్టారెంట్ల కిచెన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని టీజీ సేఫ్ అధికారులు నిర్వాహకులకు సూచించారు. ఈ విధానం అమల్లోకి వస్తే ఆహార తయారీ ప్రక్రియపై పర్యవేక్షణ పెరగడంతో పాటు, వినియోగదారుల్లో నమ్మకం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. రెస్టారెంట్లలో అపరిశుభ్రత, ఆహార

➤ మిగతా 2వ పేజీలో..

ఇది బహిరంగ ఎమర్జెన్సీ..

సీజేపీ నేతల ఆరోపణ



టి మీడియా , అక్టోబర్ 11, ఢిల్లీ బ్యూరో : కేంద్ర ప్రభుత్వం దేశంలో పౌరులపై యుద్ధం చేస్తోందని, ప్రస్తుత పరిస్థితి బహిరంగ ఎమర్జెన్సీని తలపిస్తుందని సీజేపీ నేతలు ఆరోపించారు. కోర్టు ఆదేశాలతో అరెస్టు నుంచి విడుదలైన అనంతరం ఆదివారం మీడియాతో మాట్లాడారు. సీజేపీ అగ్రనేతలు అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ మీడియా సమావేశంలో పాల్గొని కేంద్రం ప్రభుత్వంతోపాటు, పోలీసులపై ఆరోపణలు చేశారు. అక్టోబర్ 10, శనివారం చేపట్టాల్సి ఉన్న సీజేపీ నిరసనను కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే.సీజేపీ నేతలు అభిజీత్ దీప్కే సహా అగ్రనేతల్ని అరెస్టు చేసిన పోలీసులు.. కోర్టు ఆదేశాల అనంతరం విడిచిపెట్టారు. ఈ నేపథ్యంలో సీజేపీ నేతలు ఢిల్లీలో ఆదివారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లు మోదీ సర్కార్ తీరుపై విమర్శలు చేశారు. తమ సీజేపీ నేతల్ని అరెస్టు చేయడం ద్వారా మోదీ సర్కారు భయానక వాతావరణాన్ని సృష్టించాలనుకుంటోందని విమర్శించారు. తమ వారిని అడ్డుకోవడం వల్ల దేశ ప్రతిష్ట మసకబారుతుందన్నారు. "సీఈసీ జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా తాము చేపట్టిన ఆందోళనను ప్రభుత్వం మోదీ, అమిత్ షాపై తిరుగుబాటులా మార్చింది. ప్రభుత్వం పౌరులపై యుద్ధం చేస్తోంది. ఇది ఓపెన్ ఎమర్జెన్సీని తలపిస్తోంది.బంగ్లా సాహిబ్ గురుద్వారాలోకి పోలీసులు బూట్లతో ప్రవేశించారు. అది కూడా తలపాగా లేకుండా. మా ఉద్యమానికి సిక్కులు మద్దతు ఇవ్వాలి. విమానంలోనే మమ్మల్ని అరెస్టు చేశారు. ఎలాంటి పత్రాలు చూపకుండానే మమ్మల్ని నిర్బంధించారు. ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కనీసం, న్యాయ సహాయం పొందే వీలు కూడా లేకుండా చేశారు. మోదీ అత్యంత పిరికి ప్రధాని. రెండు రోజులుగా జరుగుతున్న పరిణామాలు, దిగ్బంధనాలు దేశ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయి. ఎన్నికల సంఘం మోదీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తోంది" అని రాంకా ఆరోపించారు.



నేపాల్‌లో మళ్లీ వరదలు

కొట్టుకుపోయిన ఇళ్లు, వంతెనలు

ప్రజలను తరలించేందుకు హెలికాప్టర్లు

టి మీడియా , అక్టోబర్ 11, ఢిల్లీ బ్యూరో : నేపాల్?లో మళ్లీ వరదలు ముంచెత్తాయి. ఆదివారం తెల్లవారుజామున గోర్ఖా జిల్లాలో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. బుధిగండకి నదిలో ఒక్కసారిగా వరద పోటెత్తి 35కి పైగా ఇళ్లు, పలు వంతెనలు కొట్టుకుపోయాయి. అప్రమత్తమైన అధికారులు నదీ పరివాహక ప్రాంత ప్రజలను ఎత్తైన ప్రాంతాలకు తరలి వెళ్లాలని హెచ్చరించారు. మరోవైపు, నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతుండటంతో రెస్క్యూ ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభావిత ప్రాంతాల్లో హెలికాప్టర్లను మోహరించారు.

ఆకస్మికంగా సంభవించిన నది ప్రవాహంతో సల్లేరి, పయుకా, జగత్ తదితర ప్రాంతాల్లో ఇళ్లు

➤ మిగతా 2వ పేజీలో..

పేదలకు అండగా ఉన్నాం

ఇస్తేనే పట్టాలు ఇచ్చేవారని, తాము పట్టుచీర, పసుపు కుంకుమలతో గౌరవంగా పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

సంక్షేమంలో రాజీ లేదు

సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా రాజీ పడబోమని చంద్రబాబు చెప్పారు. నెలకు వేల కోట్ల రూపాయలు సామాజిక పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' అందిస్తామన్నారు. 'స్త్రీ శక్తి' ఉచిత ప్రయాణ పథకం కింద ఇప్పటికే మహిళలు 100 కోట్ల ప్రయాణాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. దీపం-2 పథకం సబ్సిడీని నేరుగా ఖాతాల్లో వేస్తామని, విద్యుత్ చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచలేదని స్పష్టం చేశారు. ప్రతీ ఇంటికీ సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని, ప్రజారోగ్యం కోసం రాష్ట్రమంతటా 'సంజీవని' అమలు చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ, నేతన్న, మత్స్యకార, ఆటో డ్రైవర్ సేవలో వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు.

ట్రిపుల్ ఇంజిన్ సర్కార్

పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చే వారికి అనుగుణంగా మౌలిక వసతులు పెంచుతూ, పట్టణాలను గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా పీ4 విధానాన్ని తెచ్చినట్లు వెల్లడించారు. ఆర్థిక అసమానతలు తగ్గించడమే తన సంకల్పమన్నారు. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మేయర్, చైర్మన్లను నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకువచ్చామన్నారు. నీతి, నిజాయితీ ఉన్న నాయకులను గెలిపించాలని ప్రజలను కోరారు. గత ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటుతో రాష్ట్రంలో మార్పు వచ్చిందని, నాలుగోసారి సీఎంగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పట్టాలు అందుకున్న వారికి దసరా శుభాకాంక్షలు తెలుపుతూ, హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ కోసం నిరంతరం కృషి చేస్తానని ఉద్ఘాటించారు.

సీజేపీ నిరసనకారులపై 'హిందూ రక్షా దళ్'

జంతర్‌మంతర్ వద్ద సీజేపీ తలపెట్టిన నిరసనలో పాల్గొనేందుకు వెళ్తున్న యువతీ, యువకులపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. హిందూ రక్షా దళ్ సభ్యులమని చెప్పుకున్న వారు, కమలా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డీడీయూ మార్గ్‌లోని ఒక ప్రాంతంలో యువ విద్యార్థులను కొట్టారు. ఒక మహిళను నేలకు నెట్టి అసభ్యకరంగా ప్రవర్తించారు. ఆ సమయంలో ఒక పోలీస్ సిబ్బంది కూడా అక్కడ ఉన్నారు.కాగా, ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఎలాంటి ఫిర్యాదు అందనప్పటికీ ఆ నలుగురు వ్యక్తులను గుర్తించారు. నిందితులైన రమణ్ సైని, వివేకానంద్ అలియాస్ వివేక్, కపిల్ కుమార్, రవీందర్ సింగ్ అలియాస్ గోవింద్ హిందూను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు.

విమానంలో మంటలు..

విమాన సిబ్బంది వెంటనే అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

విమానంలో చోటుచేసుకున్న ఈ ఘటన నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా విమానాన్ని హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించినట్లు సమాచారం. విమాన సిబ్బంది సకాలంలో స్పందించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు తెలుస్తోంది. విమానంలోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్లు ప్రాథమిక సమాచారం.

పవర్ బ్యాంకుల విషయంలో జాగ్రత్తలు

లిథియం బ్యాటరీలు అధికంగా వేడెక్కడం, దెబ్బతినడం లేదా లోపాలు ఏర్పడటం వల్ల మంటలు చెలరేగే ప్రమాదం ఉంటుంది. గతంలోనూ విమానాల్లో పవర్ బ్యాంకుల కారణంగా అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. విమానాల్లో పవర్ బ్యాంకులతో మొబైల్ ఫోన్లను ఛార్జ్ చేయడాన్ని నిషేధిస్తూ డీజీసీఏ 2025 నవంబర్‌లో విమానయాన సంస్థలకు సూచనలు జారీ చేసింది.ప్రయాణికులు విమానయాన సంస్థల బ్యాటరీ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. పవర్ బ్యాంక్ దెబ్బతిన్నట్లుగా కనిపించినా, అసాధారణంగా వేడెక్కినా దాన్ని ఉపయోగించకూడదు.సోషల్ మీడియాలో వెలుగులోకి వచ్చిన ఒక వీడియోలో లగేజీ క్యాబిన్‌లోని మొబైల్ ఛార్జింగ్ పవర్‌బ్యాంక్‌కు అకస్మాత్తుగా మంటలు అంటుకోవడం, దీంతో ప్రయాణికులు తమ హ్యాండ్‌బ్యాగులు, బట్టలతో దానిపై ఆర్పడానికి ప్రయత్నించడం కనిపిస్తుంది. క్యాబిన్‌లో చెలరేగిన ఈ అగ్నిప్రమాదం విమానంలో గందరగోళం సృష్టించింది. కొందరు ప్రయాణికులు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించారు.

కస్టమర్ల కళ్లముందే వంట తయారీ..

పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం, వంటగదుల్లో చెత్తాచెదారం వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. వంటగదుల్లో కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆహారాన్ని సిద్ధం చేసే విధానం, పరిశుభ్రత పాటిస్తున్న తీరును పర్యవేక్షించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆహార తయారీలో పారదర్శకత పెంచడం, నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచడం ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

ఆహార భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం హైదరాబాద్‌లో రెస్టారెంట్ అసోసియేషన్ సభ్యులతో టీజీ సేఫ్ అధికారులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వంటగదుల నిర్వహణ, ముడి పదార్థాల నాణ్యత, ఆహార నిల్వ పద్ధతులు, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ప్రతి రెస్టారెంట్ ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వ్యవహరించాలని, హైజీన్ రేటింగ్‌తో కూడిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ధ్రువపత్రం పొందాలని సూచించారు.ఆహార పదార్థాల తయారీలో హానికరమైన రంగులు ఉపయోగించవద్దని అధికారులు హెచ్చరించారు. నిషేధిత పచ్చి గుడ్డుతో తయారు చేసే మయోనైజ్‌ను వినియోగించకూడదని స్పష్టం చేశారు. వంటగదులను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం, ఆహార పదార్థాలను సరైన ఉష్ణోగ్రతల్లో భద్రపరచడం, నాణ్యమైన ముడి పదార్థాలను ఉపయోగించడం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించే రెస్టారెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అధికారుల సూచనలపై స్పందించిన రెస్టారెంట్ అసోసియేషన్ సభ్యులు.. వంటగదుల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే రెస్టారెంట్ల నిర్వహణలో బాధ్యత పెరగడంతో పాటు, ఆహార భద్రతా ప్రమాణాల అమలును పర్యవేక్షించడం సులభమవుతుంది. అయితే కెమెరాల ఏర్పాటు మాత్రమే కాకుండా, వంటగదుల పరిశుభ్రత, ఆహార నాణ్యత, సిబ్బంది ఆరోగ్య అలవాట్లపై నిరంతర శ్రద్ధ అవసరం. ఈ చర్యలు సక్రమంగా అమలైతే నగరంలోని రెస్టారెంట్లలో సురక్షితమైన ఆహారం అందించే దిశగా మరో ముందడుగు పడనుంది.

ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించండి

పేర్కొంది. దేశ సేవలో సుప్రీంకోర్టు ఎప్పుడూ ముందుంటుందని పేర్కొంది.సీజేపీ నిరసన కారణంగా దిల్లీలో మెట్రో, రైలు సర్వీసులపై "సంపూర్ణ నిషేధం" అమలు చేయరాదన్న కోర్టు ఆదేశాన్ని అధికారులు బహిరంగంగా ఉల్లంఘించారంటూ, వారిపై కోర్టు ధిక్కరణ కేసు ఫైల్ చేయాలంటూ పిటిషన్? దాఖలైంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన ఈ కోర్టు ధిక్కరణ పిటిషన్‌లో, కేంద్ర హోం కార్యదర్శి గోవింద్ మోహన్, దిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డి. తారాలను ప్రతివాదులుగా చేర్చారు.

మరోవైపు రాజకీయ నాయకుల నిర్బంధానికి వ్యతిరేకంగా సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ పిటిషన్‌ను దాఖలు చేశారు. వీటిపై జస్టిస్? జోయ్?మాల్య బాగ్చీ, జస్టిస్? వి.మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము న్యాయవాదులందరి వాదనలు వింటామని, జరిగిన దానిని ఏమాత్రం తక్కువ చేయమని తేల్చిచెప్పింది. రైల్వే, మెట్రో సహా పలు రవాణా సేవలను నిలిపివేయడంపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్?ను కూడా పరిశీలిస్తామని చెప్పింది.కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్? తుషార్? మెహతా తన వాదనలు వినిపించారు. సీజేపీ నిరసనల వేళ, దిల్లీలో మొత్తం 303 మెట్రో స్టేషన్లలో, కేవలం 45 స్టేషన్లను మాత్రమే మూసివేశారని కోర్టుకు తెలిపారు. ఒక స్టేషన్ మూసివేస్తే, పక్క స్టేషన్ తెరిచే ఉందని పేర్కొన్నారు. "మెట్రో స్టేషన్లు తెరిచి ఉంటాయి. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరిస్తాం. న్యాయవాదులు తమ విధులు నిర్వహించకుండా అడ్డుకోం. ప్రజా భద్రతకు లోబడి సాధారణ రాకపోకలను కొనసాగిస్తాం" అని ప్రభుత్వం తరఫున తుషార్ మెహతా చెప్పారు. దీనితో ఆయన చేసిన వాదనలను రికార్డు చేసుకుంటున్నామని ధర్మాసనం వెల్లడించింది.

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

వాదనలు విన్న తర్వాత సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వానికి, దిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'దిల్లీలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను వెంటనే పునరుద్ధరించాలి. ఎలాంటి ఆంక్షలు లేకుండా మెట్రో రైలు సేవలను యథావిధిగా నడపాలి. లాయర్ల విధులకు అడ్డంకులు సృష్టించకూడదు. ఓ ఒక్క న్యాయవాదిని వృత్తిపరమైన బాధ్యతలు నిర్వర్తించకుండా అడ్డుకోవడానికి వీలు లేదని' సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అలాగే దిల్లీ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అనవసరమైన బారికేడ్లను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. అంతేకాదు, 'అక్టోబర్? 10న ఏ ఆంక్షలు విధించారు? ఎందుకు విధించారు? అనే దానిపై వచ్చే వారం పూర్తి వివరాలతో వివరణాత్మక అఫిడవిట్ దాఖలు చేయాలని' కేంద్రాన్ని ఆదేశించింది.

నేపాల్‌లో మళ్లీ వరదలు

కొట్టుకుపోయాయని చుమ్నుబ్రి రూరల్ మున్సిపాలిటీ 3వ వార్డు చైర్మన్ రామ్ కుమార్ గురుంగ్ చెప్పినట్లు 'కాఠ్మండు పోస్ట్' నివేదించింది. వరద కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. వర్షం లేకున్నా నదిలో అకస్మాత్తుగా వరద రావడానికి గల కచ్చితమైన కారణం తెలియాల్సి ఉందని చెప్పారు. బుధిగండకి ఉపనది అయిన సియార్ వాగు ప్రవాహానికి హిమపాతం అడ్డుపడి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అది కరిగి ఒక్కసారిగా ఉప్పెనలా వచ్చి వరద వచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

ప్రభావిత ప్రాంతంలో సైన్యాన్ని మోహరించాం: నేపాల్ ప్రధాని

ఈ ఘనటపై నేపాల్? ప్రధాని బాలేంద్ర షా స్పందించారు. "బుధి గండకి నదిలో వరద పోటెత్తిన నేపథ్యంలో సహాయక చర్యలు ప్రారంభించాం. ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్? సైన్యం సహాయక చర్యలు చేపట్టింది. హెలికాప్టర్ల ద్వారా అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్? చేపట్టారు. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న జగత్ ప్రాంతం నుంచి ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. కాఠ్మాండులో ఉన్న 'కాంపోజిట్ క్విక్ రియాక్షన్ టీమ్'ను కూడా వాయు మార్గం ద్వారా ప్రభావిత ప్రాంతానికి తరలించారు" అని ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

అటువైపు ఎవరూ వెళ్లవద్దు!

ఇదిలా ఉండగా, వరద తగ్గే వరకు త్రిశూలి దోభన్ నదీ సమీపంలోకి ఎవరూ వెళ్లవద్దని నేపాల్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అలాగే, చుమ్నుబ్రి గ్రామీణ మున్సిపాలిటీలోని సియురిబాస్ పైన కొండచరియలు విరిగిపడినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయని గోర్ఖా జిల్లా అధికారి ధర్మేంద్ర కుమార్ మిశ్రా తెలిపారు. జగత్ వద్ద నదీ ప్రవాహంలో ఇళ్లు కొట్టుకుపోయినట్లు సమాచారం అందిందని తెలిపారు. వరదల కారణంగా లామ్‌జంగ్, డోల్పా, రుకుం తూర్పు, రుకుం పశ్చిమ, జజ్కోట్, దార్చులా, బైతాది, డడేల్‌ధుర, డోటి, కైలాలి, కంచన్‌పుర్ జిల్లాలకు ముప్పుందని అధికారులు పేర్కొన్నారు. సియురిబాస్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడడంతో పలువురు గాయపడ్డారని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పోలీసులతో పాటు, సైనికులు తీవ్రంగా శ్రమిస్తున్నారని చెప్పారు.

పెద్ద శబ్దంతో నది ప్రవాహం

ఆకస్మిక వరదల గురించి స్థానిక అధికారులు వివరాలు వెల్లడించారు. ఆదివారం తెల్లవారుజామున నది ఒక్కసారిగా ఉప్పొంగడంతో నదీ ప్రవాహపు పెద్ద శబ్దాలు వినిపించాయని పేర్కొన్నారు. "ఉదయం సుమారు 4 గంటల నుంచే నీటిమట్టం ఒక్కసారిగా పెరిగింది. నదిలో నీటి ప్రవాహం శబ్దం కూడా పెద్దగా వినిపిస్తోంది. ఉగ్లంగ్, స్యార్ వాగులు ఉప్పొంగుతున్నాయి. చెకంపర్‌లో నది ప్రవాహానికి అడ్డంకి ఏర్పడి ఉండవచ్చని, అలాగే నదిలో కొండచరియలు విరిగిపడటంతో ఏర్పడిన ఆనకట్ట తెగిపోయి ఉండవచ్చని తెలుస్తోంది" అని తెలిపారు. మరోవైపు, నీటిమట్టం పెరగడంతో చుమ్లింగ్, లోక్పాతో సహా నదీతీర ప్రాంతాల నివాసితులు తమ ఇళ్లను ఖాళీ చేశారు. ప్రభావిత ప్రాంతమైన అరుఘాట్‌లోని ఏరియా పోలీస్ ఆఫీస్ భద్రతా హెచ్చరిక జారీ చేశారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం



విశాఖపట్నం, అక్టోబరు 11 మలక్కా జలసంధి, పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం అక్కడే స్థిరంగా కొనసాగుతున్నది. ఇది సోమవారం నాటికి అండమాన్ సముద్రంలో ప్రవేశించనుంది. దీని ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడనుంది. తరువాత మూడు, నాలుగు రోజుల్లో పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర దిశగా వచ్చే క్రమంలో బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా రాష్ట్రంలో అనేక చోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా నమోదయ్యాయి. కర్నూలులో 37.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండతీవ్రతతో అక్కడక్కడ ఉరుములతో వర్షాలు కురిశాయి. రానున్న రెండు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది.

నాలుగైదు రోజుల్లో ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు

నేను పోటీ చేయటంపై అధిష్ఠానం నిర్ణయిస్తుంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, అక్టోబరు 11 రాష్ట్రంలో త్వరలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు తమ పార్టీ అభ్యర్థులను నాలుగైదు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయాలా వద్దా? అనేది జాతీయ నాయకత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఆదివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీయే గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ఈసారి టికెట్ల కోసం తీవ్ర పోటీ ఉందని, ఆశావహుల వివరాలను అధిష్ఠానానికి పంపినట్లు వెల్లడించారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ తన రాజకీయ స్వార్థం కోసం వాడుకుందని, ఎన్నికల కమిషనర్లను రాజకీయ బానిసలుగా మార్చిన చరిత్ర ఆ పార్టీదని ధ్వజమెత్తారు. అనేక దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా, భారత్ మాత్రం 7.8 శాతం వృద్ధిరేటుతో దూసుకుపోతోందని చెప్పారు. ప్రభుత్వ అధినేతగా (సీఎం, పీఎంగా) ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం రాష్ట్ర పార్టీ కార్యాలయంలో రాంచందర్‌రావు అధ్యక్షతన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశం జరిగింది. మోదీకి అభినందనలు తెలియజేస్తూ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు.

సిద్దిపేట గడ్డ నుంచే మరో ఉద్యమం

మళ్లీ బీఆర్ఎస్‌దే అధికారం

ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు

నీళ్లున్నా పంటలను ఎండబెడుతున్నారు: హరీశ్‌రావు



సిద్దిపేట, అక్టోబరు 11 "నాడు తెలంగాణ ఉద్యమానికి, తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటుకు సిద్దిపేటనే వేదికైంది. రేపు మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడానికి కూడా ఈ గడ్డ నుంచే ఉద్యమం మొదలవుతుంది" అని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం సిద్దిపేటలో దశాబ్ది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. గోదావరి, కృష్ణా జలాల్లో పుష్కలంగా నీరున్నా పంటలను ఎంబెడుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. ఇది కాలంతో వచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అని ఆరోపించారు. మళ్లీ పాతరోజులు తెస్తానని అన్నట్లుగానే రేవంత్ చేశారన్నారు.కరెంటు కోతలు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం, మోటార్లు కాలడం, యూరియా కోసం చెప్పుల వరుసలు, పంటలు ఎండడం అన్నీకూడా పాతరోజులను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. 9నెలల క్రితమే ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా చర్యలు తీసుకోలేదని..తన బావమరిదికి బొగ్గు టెండర్లు కట్టబెట్టేందుకు బొగ్గు ఉత్పత్తి ఆలస్యం చేయడంతో విద్యుత్ కోతలు తలెత్తుతున్నాయన్నారు. పదేళ్ల క్రితం కొత్త జిల్లాలు ఏర్పడగా.. సంబరాలు జరిపితే కేసీఆర్‌కు పేరొస్తుందని ప్రభుత్వం తరపున కనీస వేడుకలు చేయలేదని ఆయన విమర్శించారు. కాగా ఈ వేడుకల్లో కేసీఆర్ చిత్రపటానికి రంగనాయకసాగర్ గోదావరి జలాలతో అభిషేకం చేశారు. తెలంగాణ వచ్చాకనే నలభై ఏళ్ల నినాదాలైన సిద్దిపేట జిల్లా ఏర్పాటు, గోదావరి జలాలు, రైలు సౌకర్యం సాకారమైందని వివరించారు.

యూనిట్ విద్యుదుత్పత్తికి రూ.5.61 సింగరేణి థర్మల్ ప్లాంటువ్యయం భారీగా పెంపు



టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : మంచిర్యాల జిల్లా పెగడపల్లిలో సింగరేణి సంస్థ నిర్మిస్తున్న 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటు నిర్మాణ వ్యయం భారీగా పెరిగింది. తొలుత వేసిన అంచనాలతో పోలిస్తే ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరగడం చర్చనీయాంశంగా మారింది. 2024-25 లెక్కల ప్రకారం ఈ ప్లాంట్ నిర్మాణ వ్యయం రూ.9,697 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. గతంలో మెగా వాట్‌కు రూ.10.80 కోట్ల వరకు పెట్టుబడి అవసరం అవుతుందని భావించగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.11.99 కోట్లకు చేరింది. నిర్మాణం పూర్తి కావడానికి ఇంకా నాలుగేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తుండటంతో భవిష్యత్తులో వ్యయం మరింత పెరిగే అవకాశాలున్నాయి.

యూనిట్ విద్యుత్‌కు రూ.5.61 - అదనంగా లైన్ల ఖర్చు

ఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే విద్యుత్‌కు తొలి ఏడాది యూనిట్‌కు రూ.5.61 ఖర్చవుతుందని డిస్కంలు వెల్లడించాయి. దీనికి విద్యుత్ లైన్ల కిరాయి వ్యయంగా యూనిట్‌కు మరో రూ.60 పైసలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.5.25కు మించరాదని జాతీయ సౌర విద్యుత్ సంస్థ ఇటీవల నిర్వహించిన టెండర్లలో తేలినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో థర్మల్ ప్లాంటు ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్ ధరపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే విద్యుత్ కొనుగోలు ధరతో పాటు సరఫరా విశ్వసనీయత, అందుబాటు, ఇతర నిర్వహణ ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణ డిస్కంల కొనుగోలుకు ప్రతిపాదన

పెగడపల్లి ప్లాంటులో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను తొలుత రాజస్థాన్‌కు సరఫరా చేయాలని యోచించినప్పటికీ, తాజాగా తెలంగాణ డిస్కంలు తామే కొనుగోలు చేస్తామని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ)కి పిటిషన్ దాఖలు చేశాయి. దీనికి అనుబంధంగా తెలంగాణ దక్షిణ డిస్కం సమగ్ర ప్రాజెక్టు నివేదికను సమర్పించింది. ప్లాంటు నిర్మాణం ప్రారంభమైన తేదీ నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించడానికి 48 నెలల సమయం పడుతుందని నివేదికలో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 29న బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు ఈఆర్‌సీ తెలిపింది. ప్రాజెక్టు వ్యయం, విద్యుత్ ఉత్పత్తి ధర, వినియోగదారులపై పడే ఆర్థిక భారాన్ని ఈ విచారణలో పరిశీలించనున్నారు.

ఒడిశా నుంచి బొగ్గు - రవాణా ఖర్చులపై ఆందోళన

ఈ ప్లాంటుకు ఒడిశాలోని నైనీ గని నుంచి ఏటా 40 లక్షల టన్నుల బొగ్గును సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. సుమారు 800 కిలోమీటర్ల దూరం నుంచి బొగ్గును రవాణా చేయాల్సి ఉండటంతో రవాణా వ్యయం కూడా కీలకంగా మారనుంది. తెలంగాణలోని సింగరేణి గనులు సమీపంలోనే ఉన్నప్పటికీ, అవసరమైన నాణ్యత కలిగిన బొగ్గు అందుబాటులో లేకపోవడంతో నైనీ గనిపై ఆధారపడుతున్నట్లు సమాచారం.

నీటి అవసరాలు - పెట్టుబడికి రుణాలే ఆధారం

ప్లాంటుకు అవసరమైన నీటి కోసం షట్‌పల్లి వద్ద గోదావరి నుంచి ఒక టీఎంసీ, దేవులవాడ వద్ద ప్రాణహిత నది పంపుహౌస్ నుంచి మరో రెండు టీఎంసీల నీటిని తీసుకోవాలని సింగరేణి ప్రతిపాదించింది. ప్రాజెక్టు మొత్తం పెట్టుబడిలో 75 శాతం నిధులను విద్యుత్ ఆర్థిక సంస్థల నుంచి రుణాలుగా సమీకరించాలని నిర్ణయించింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాంటు నిర్మాణాన్ని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది.త్తంగా, సింగరేణి థర్మల్ ప్లాంటు నిర్మాణం రాష్ట్ర విద్యుత్ అవసరాలకు ఎంతవరకు ఉపయోగపడుతుంది? పెరుగుతున్న నిర్మాణ, బొగ్గు రవాణా ఖర్చులు విద్యుత్ ధరపై ఎలాంటి ప్రభావం చూపుతాయి? అన్నది కీలకంగా మారింది. ఈఆర్‌సీ విచారణలో వెలువడే నిర్ణయాలు వినియోగదారులపై పడే భారాన్ని అంచనా వేయడంలో ప్రాధాన్యం సంతరించుకోనున్నాయి.

సబ్‌స్టేషన్ వద్ద రైతుల వంటవార్పు

టీ మీడియా, అక్టోబర్ 11, జడ్చర్ల : విద్యుత్ కోతల వల్ల పంట పొలాలు ఎండిపోతున్నాయని నాగర్ కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలానికి చెందిన ఊర్కొండపేట, జాకినాలపల్లి రైతులు ఆదివారం జాకినాలపల్లి -- సబ్ స్టేషన్ వద్ద వంటవార్పు తో నిరసన తెలిపారు. ఊర్కొండపేట మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్ , రైతులు మాట్లాడుతూ సాగు కోసం అప్పులు చేసి, పంటలను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు.అన్నదాతలకుపొలాలకు నీరు పెట్టాల్సిన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాల తో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రెక్కలు ముక్కలు చేసుకుని పంట పండించే రైతన్నకు కనీసం సక్రమంగా విద్యుత్ సరఫరా కూడా అందడం లేదని పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్, సాగునీరు అందించడం ప్రభుత్వాల బాధ్యతని గుర్తు చేశారు. విద్యుత్ కోతలను నివారించి, నిరంతర విద్యుత్ సరఫరా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రైతులు రామాంజనేయులు, సూక్కపురం అంజయ్య, శ్రీధర్ రెడ్డి, కటమోని జంగయ్య, ఆలకుంట మల్లేష్, కప్పర చంద్రయ్య, సురేందర్,సాయి రెడ్డి, మోటపురం యాదయ్య, బాల్‌రాజ్ , సిరిగిరి జంగయ్య, జల్లయ్య, పోలే కృష్ణయ్య పాల్గొన్నారు.



ఖమ్మంలో టీ హబ్‌ల రాజ్యం!





- ఖాళీ స్థలాల్లో షెడ్లు.
- -కూల్చిసిన ఇంటి నంబర్లతో కనెక్షన్లు!
- రోడ్లపై పార్కింగ్‌లు..

-● అర్ధరాత్రి వరకు కార్యకలాపాలు..

టీ మీడియా, అక్టోబర్ 11, ఖమ్మం బ్యూరో:ఖమ్మం నగరంలో టీ హబ్‌లు, ఫుడ్ కోర్టుల వ్యాపారం జోరుగా సాగుతోంది. కానీ వాటి వెనుక అనుమతులు, పన్నుల చెల్లింపులు, విద్యుత్ కనెక్షన్లు, పార్కింగ్ సదుపాయాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఖాళీ స్థలాల్లో తాత్కాలిక షెడ్లు వెలుస్తుంటే.. రహదారులే పార్కింగ్ ప్రదేశాలుగా మారుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపారం కోట్లకు చేరుతోందా? ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందా? ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ వ్యవహారాలపై అధికార యంత్రాంగం ఎప్పుడు స్పందిస్తుంది?

నగరం నలువైపులా టీ హబ్‌ల విస్తరణ!

ఖమ్మం నగరం విద్యా, వైద్య, వాణిజ్య రంగాల్లో వేగంగా విస్తరిస్తోంది. జాతీయ రహదారులు, ఇతర రాష్ట్రాలకు అనుసంధానించే మార్గాలతో నగరంలో రాకపోకలు పెరిగాయి. యువత సంఖ్య పెరగడం, మారుతున్న ఆహారపు అలవాట్లతో టీ హబ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు, ఫుడ్ కోర్టులకు డిమాండ్ పెరిగింది.

ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని నగరంలో వ్యాపార కేంద్రాలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. అనధికారిక అంచనాల ప్రకారం సుమారు 70 టీ హబ్‌లు, 30కి పైగా ఫుడ్ కోర్టులు ఉన్నట్లు తెలుస్తోంది. వీటి రోజువారీ మొత్తం వ్యాపారం రూ.50 లక్షల వరకు ఉంటుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే, ఈ సంఖ్యలకు అధికారిక గణాంకాలు ఉన్నాయా? వ్యాపార సంస్థల సంఖ్య, వాటి ఆదాయం, లైసెన్స్‌ల వివరాలను సంబంధిత శాఖలు వెల్లడించగలవా?

ఖాళీ స్థలం.. రేకుల షెడ్డు.. భారీ వ్యాపారం!

నగరంలోని కొన్ని ఖాళీ స్థలాలను నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు అద్దెకు తీసుకుని రేకుల షెడ్లు ఏర్పాటు చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే సమాచారం ఉంది. తాత్కాలికంగా కనిపించే ఈ నిర్మాణాల్లో కొన్ని భారీ వ్యాపార కేంద్రాలుగా మారుతున్నాయి.

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. స్థలం వాణిజ్య అవసరాలకు అనువైనదేనా? అవసరమైన అనుమతులు తీసుకున్నారా? భవన నిర్మాణ, పార్కింగ్, అగ్నిమాపక భద్రతా నిబంధనలు వర్తించే చోట వాటిని పాటిస్తున్నారా?

గతంలో కూల్చివేసిన ఇళ్లకు సంబంధించిన పాత ఇంటి నంబర్ల ఆధారంగా ఆస్తి పన్ను చెల్లింపులు లేదా విద్యుత్ కనెక్షన్లు కొనసాగుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటిలో వాస్తవాలు ఏమిటో మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.

వాణిజ్య వ్యాపారానికి గృహ విద్యుత్ కనెక్షనా?

వ్యాపారం మాత్రం వాణిజ్య స్థాయిలో సాగుతుంటే.. పన్నుల లెక్కలు, విద్యుత్ వినియోగం ఏ ప్రాతిపదికన నమోదవుతున్నాయి? కొన్ని చోట్ల చిన్న ఇళ్లుగా చూపిస్తూ ఆరు నెలలకు సుమారు రూ.1,000 వరకు మాత్రమే ఆస్తి పన్ను చెల్లిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వాస్తవంగా ఆస్తి పన్ను ఎంత చెల్లిస్తున్నారు? ఆస్తుల వినియోగంలో మార్పులు ఉంటే మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేశారా? వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న కేంద్రాల్లో విద్యుత్ కనెక్షన్లు ఏ కేటగిరీలో ఉన్నాయి? ఇవి కేవలం సాంకేతిక ప్రశ్నలు కావు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సక్రమంగా అందుతోందా లేదా అన్నది తేల్చాల్సిన కీలక అంశాలు.

రోడ్లు ప్రజల కోసం.. పార్కింగ్ వ్యాపారాల కోసమా?

మమతా రోడ్డు, గట్టయ్య సెంటర్ రోడ్డు, బస్ డిపో రోడ్డు పరిసరాల్లో టీ, ఫుడ్ కేంద్రాలు అధికంగా ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్ని కేంద్రాలకు వచ్చే వాహనాలను రోడ్లపైనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. పార్కింగ్ వివాదాలు స్థానికులతో ఘర్షణలకు దారితీసి, కొన్ని సందర్భాల్లో పోలీస్ కేసులు, కోర్టు వ్యవహారాల వరకు వెళ్లినట్లు సమాచారం.

వ్యాపారం నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. కానీ ఆ వ్యాపారం కారణంగా ప్రజలకు చెందిన రహదారులు ఆక్రమణకు గురైతే ఎలా? పార్కింగ్‌కు తగిన స్థలం లేకపోతే అనుమతుల మంజూరులో అధికారులు ఏ అంశాలను పరిశీలిస్తున్నారు? ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సంయుక్త తనిఖీలు ఎందుకు చేపట్టకూడదు?

విద్యాసంస్థల పక్కనే ఈ పరిస్థితులా?

శాంతినగర్‌లోని ప్రభుత్వ విద్యాసంస్థ పక్కనే మూడు భారీ టీ స్టాళ్లు, ఒక ఫుడ్ కోర్టు ఉన్నట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఈ కేంద్రాల పరిసరాల్లో కొందరు విద్యార్థులు గుమిగూడటం, పొగాకు ఉత్పత్తులు, ధూమపానం వంటి అలవాట్లకు మైనర్ విద్యార్థులు లోనవుతున్నారనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ ఆరోపణలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయం జరుగుతోందా? విద్యాసంస్థల సమీపంలో వర్తించే చట్టపరమైన పరిమితులు పాటిస్తున్నారా? విద్యార్థుల భవిష్యత్తుకు ఇబ్బంది కలిగించే పరిస్థితులు ఉంటే వాటిని నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

విద్యాసంస్థల పక్కన వ్యాపారాలు ఉండటమే తప్పు కాదు. కానీ విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, చదువుకు ఇబ్బంది కలిగించే పరిస్థితులు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు.

టీ రుచికి రసాయనాలా? ఆహార భద్రత తనిఖీలు ఎక్కడ?

కొన్ని టీ కేంద్రాల్లో టీ పొడి నాణ్యత, సువాసన, చిక్కదనం కోసం రసాయన పదార్థాలు వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే, ప్రయోగశాల పరీక్షలు లేదా అధికారిక తనిఖీల ద్వారా నిర్ధారణ కానంతవరకు వీటిని వాస్తవాలుగా చెప్పలేం.

అయినా ఈ ఆరోపణలపై ఆహార భద్రతా శాఖ స్పందించాల్సిన అవసరం ఉంది. టీ పొడి, పాలు, నీరు, ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్నారా? అవసరమైన ఫుడ్ సేఫ్టీ నమోదు లేదా లైసెన్స్‌లు ఉన్నాయా? పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా?

ప్రజలు రోజూ వినియోగించే టీ, ఆహార పదార్థాల విషయంలో తనిఖీలు కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడే కాకుండా క్రమం తప్పకుండా జరగాలి.

రోజుకు రూ.2 వేల టీ, సిగరెట్ల ఖర్చా?

కొన్ని కేంద్రాల్లో గంటల తరబడి కూర్చుని చర్చలు, పంచాయతీలు నిర్వహించే వ్యక్తులు రోజుకు రూ.2 వేలకు మించి టీ, సిగరెట్ల కోసం ఖర్చు చేస్తున్న సందర్భాలు ఉన్నాయని స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

అయితే, ఇలాంటి ఖర్చులు లేదా సమావేశాలు మాత్రమే అక్రమ కార్యకలాపాలకు ఆధారం కావు. కొన్ని కేంద్రాల వద్ద సెటిల్‌మెంట్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉంటే, వాటిపై ఆధారాలతో విచారణ జరగాలి. వ్యాపార కేంద్రాలు ఎవరికి అడ్డాలుగా మారుతున్నాయి? ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా? పోలీసులు వాస్తవాలను వెలికితీయాలి.

రాజకీయ అండదండలున్నాయా?

కొన్ని కేంద్రాల ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతుండటంతో, వాటి నిర్వహణ వెనుక రాజకీయ అండదండలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల ప్రైవేటు వ్యక్తులకు అనధికారికంగా డబ్బులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

అయితే, ప్రారంభోత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరైనంత మాత్రాన అక్రమాలకు రాజకీయ అండ ఉందని నిర్ధారించలేం. ఆరోపణలు నిజమో కాదో తేల్చాల్సింది విచారణే. అధికార పార్టీ అయినా, ప్రతిపక్షమైనా.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి.

అధికారులారా.. తనిఖీలు ఎప్పుడు?

ఖమ్మం నగరంలో టీ హబ్‌లు, ఫుడ్ కోర్టుల నిర్వహణపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత సంబంధిత శాఖలపై ఉంది.

నగరంలో ఎన్ని టీ హబ్‌లు, ఫుడ్ కోర్టులు అధికారికంగా నమోదయ్యాయి?

ఎన్ని కేంద్రాలకు అవసరమైన ఫుడ్ సేఫ్టీ, ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి?

ఆస్తి పన్ను, విద్యుత్ కనెక్షన్ల వివరాలు క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారా?

రోడ్లపై పార్కింగ్, ఆక్రమణలపై ఎన్ని చర్యలు తీసుకున్నారు?

విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయాలు, మైనర్లకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిగిందా?

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కేంద్రాలు ఉన్నట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా వ్యాపారాలు సాగాలి. ప్రభుత్వానికి రావాల్సిన పన్నులు సక్రమంగా వసూలు కావాలి. ఆహార భద్రత, విద్యార్థుల ఆరోగ్యం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

ఖమ్మం నగరంలో టీ హబ్‌లు, ఫుడ్ కోర్టుల నిర్వహణపై మున్సిపల్, ఆహార భద్రత, విద్యుత్, ట్రాఫిక్, పోలీస్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలి.

వ్యాపారానికి అడ్డంకులు వద్దు.. కానీ నిబంధనలకు మినహాయింపులు కూడా వద్దు!

(ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు, క్షేత్రస్థాయి పరిశీలనతో మరో కథనంలో...)

గోల్డ్ మెడల్ సాధించిన కారేపల్లి యువకుడు

- బీఎస్సీ ఆప్టోమెట్రీలో అఖీల్ ఖాన్‌కు స్వర్ణ పతకం

టీ మీడియా,అక్టోబర్11,సింగరేణి(కారేపల్లి):కుటుంబంలో ఎదురైన కష్టాలు ఆయన లక్ష్యాన్ని అడ్డుకోలేకపోయాయి.ఓ వైపు తండ్రి రోడ్డు ప్రమాదానికి గురికావడం,మరోవైపు తల్లి కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి..చెల్లెలి బాధ్యతలు..ఇన్ని ఇబ్బందుల మధ్య కూడా చదువును నిర్లక్ష్యం చేయకుండా పట్టుదలతో ముందుకు సాగిన కారేపల్లి యువకుడు మహమ్మద్ అఖీల్ ఉల్లా ఖాన్ బీఎస్సీ ఆప్టోమెట్రీలో గోల్డ్ మెడల్ సాధించి ప్రతిభ చాటారు.డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్,విజయవాడకు అనుబంధంగా ఉన్న రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో అఖీల్ ఖాన్ గోల్డ్ మెడల్ అందుకున్నారు.బీఎస్సీ ఆప్టోమెట్రీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రముఖుల చేతుల మీదుగా స్వర్ణ పతకాన్ని స్వీకరించారు.చిన్నతనం నుంచే చదువులో చురుకుగా ఉండే అఖీల్ ఖాన్ జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో ఉచిత సీటు సాధించి,తన గ్రాడ్యుయేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.చదువుతో పాటు కుటుంబానికి అండగా నిలుస్తూ ఆయన సాధించిన ఈ విజయం స్థానికులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

కష్టాలను ఎదుర్కొంటూనే లక్ష్యం వైపు..



అఖీల్ ఖాన్ చదువుకుంటున్న సమయంలోనే కుటుంబం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. కుమారుడి భవిష్యత్తుకు బాటలు వేస్తున్న తండ్రి మహమ్మద్ ఖలీల్ ఉల్లా ఖాన్ తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.తల్లి రషీదా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తల్లిదండ్రులకు అండగా ఉంటూనే చెల్లెలు రీషా బాధ్యతలను చూసుకుంటూ అఖీల్ తన చదువును కొనసాగించారు.కుటుంబ సమస్యలను అధిగమిస్తూ పట్టుదలతో చదివి చివరకు గోల్డ్ మెడల్ సాధించి తన లక్ష్యాన్ని చేరుకున్నారు.తమ కుమారుడు ఎదురైన కష్టాలకు వెనుకడుగు వేయకుండా చదువులో గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉందని తల్లిదండ్రులు ఖలీల్ ఉల్లా ఖాన్--రషీదా తెలిపారు.భవిష్యత్తులో కంటి ఆరోగ్య రంగంలో నిపుణుడిగా ఎదిగి సమాజానికి మంచి సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు వారు ఆనందం వ్యక్తం చేశారు.

పండుగ ప్రయాణాలు

బస్ టికెట్ ధరలకు రెక్కలు

టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : బస్టాండ్లలో రద్దీ కనిపించినా, టికెట్ బుకింగ్ సైట్‌కు ఎక్కువ హిట్స్ వచ్చినా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల టికెట్ ధరలు ఒక్కసారిగా పెరిగిపోతుంటాయి. ఎప్పుడు పెరుగుతున్నాయో టికెట్ బుకింగ్ ఏజెంట్లకు కూడా తెలియడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో బస్సుల నిర్వాహకులు అమాంతం ధరలు పెంచేశారు.

ఇష్టం లేకున్నా తప్పని పరిస్థితి

ప్రభుత్వ సర్వీసులు (తెలంగాణ ఆర్టీసీ) కూడా స్పెషల్ బస్సుల పేరిట ట్యాగ్ తగిలించుకొని రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నాయి. మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్ వైపు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు రెట్టింపునకు మించి వసూలు చేస్తుండటంతో ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతోంది.

ఈ నెల 9వ తేదీన కూకట్‌పల్లి నుంచి విజయవాడకు వెళ్లిన ఒక ఏసీ స్లీపర్ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఒకరికి ఏకంగా రూ.1,700 వసూలు చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. సాధారణ రోజుల్లో రూ.580 నుంచి రూ.700 వరకు ఉండే ఈ టికెట్? ధర మూడొంతులు పెరగడం నిజంగా చాలా ఎక్కువ అని ప్రయాణికులు వాపోతున్నారు. అంత వెచ్చించేందుకు ముందుకొచ్చారా అని టికెట్ బుకింగ్ ఏజెంట్‌ను అడిగితే "ఆలస్యం చేస్తే టికెట్? రేట్? ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఇష్టం లేకున్నా కొనుగోలు చేశారు" అని చెప్పారు.



ఒకే నంబర్?తో రెండు బస్సులు

దసరా పండుగ సీజన్ మొదలు కావడంతో కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ పాత బస్సులు, ఫిట్‌నెస్ లేని వాటిని నడిపే అవకాశం ఉంది. దీంతో రవాణా శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా బస్సుల తనిఖీలను ముమ్మరం చేశారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో ఒకే నంబర్?తో తిరుగుతున్న రెండు బస్సులను గుర్తించి ఆధీనంలోకి తీసుకున్నారు. సాజన్ ట్రావెల్స్ పేరుతో ఒకే యాజమాన్యం కింద ఈ బస్సులను అనుమతి లేకుండా నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి ఆర్టీవో రవికుమార్, ఇన్‌స్పెక్టర్ హర్షితలకు బాధ్యత అప్పగించినట్లు జాయింట్ ట్రాన్స్?పోర్ట్ కమిషనర్ వెంకటరమణ తెలిపారు. అధిక ధరలకు టికెట్లు విక్రయించినా, పాత, ఫిట్‌నెస్ లేనివి ఉపయోగించినా సీజ్? చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జేటీసీ హెచ్చరించారు.

మధ్యలో ఆపేదే లేదు!

వరంగల్ రూట్?లో భువనగిరి, జనగామ, విజయవాడ మార్గంలో సూర్యాపేట, కోదాడ వెళ్లాల్సిన వాళ్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఏ ట్రావెల్స్ కూడా మధ్య స్టాప్‌లలో దిగాల్సిన ప్రయాణికులను పరిగణనలోకి తీసుకోవడం లేదు. నేరుగా బస్టాప్ వెళ్లి డ్రైవర్‌ను బతిమాలినా ఏమాత్రం ఫలితం ఉండటం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ వరకు టికెట్ తీసుకుంటా, మధ్యలో కోదాడలో ఆపితే దిగిపోతా అని చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

అభివృద్ధి, సంక్షేమంకి సమ ప్రాధాన్యత

-మంత్రి పాశీగులేటి శ్రీనివాసరెడ్డి

టీ మీడియా, అక్టోబర్ 11 ,కూసుమంచి:ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం మంగళితాండ గ్రామంలో మంగళితాండ నుండి దుబ్బబండ వరకు రూ. 163.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న బిటీ రోడ్డు, జుజ్జుల్ రావుపేట గ్రామంలో రూ. 45 లక్షల వ్యయంతో నిర్మించనున్న 100 కేఎల్ ఓహెచ్ఎస్ఆర్, పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. మంగళితాండ గ్రామంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. కూసుమంచి మంత్రి క్యాంపు కార్యాలయంలో కూసుమంచి మండలానికి చెందిన 30 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు మంత్రి చెక్కుల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాల లబ్ధి చేకూరుస్తూ, మెరుగైన పాలన అందిస్తున్నదని తెలిపారు. ఇందరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్నబియ్యం పంపిణీతో పాటు పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించమనే దుష్ప్రచారం నమ్మొద్దని, కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ పథకాన్ని ప్రజా ప్రభుత్వం అమలుచేస్తుందని అన్నారు. ప్రస్తుత కాలంలో ఎల్నినో కారణంగా దేశంతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా తాగునీరు, కరెంట్ సమస్య



తీవ్రంగా ఏర్పడుతున్నట్లు చెప్పారు. విద్యుత్ కొరత వల్ల రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కరంట్ ను యూనిట్ కి 15 రూపాయలు పెట్టి కొనాలన్నా, ఏ ప్లాట్ ఫామ్ లోనూ కరంట్ అందుబాటులో లేదన్నారు. మొదటి పంటను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు.అయితే, నీటి, కరెంట్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతన్నలు రెండవ పంట వెయ్యొద్దని మంత్రి రైతులను కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, విద్యాశాఖ ఈఈ బుగ్గయ్య, మిషన్ భగీరథ ఈఈ వాణిశ్రీ, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఏదలాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, కూసుమంచి మండల తహశీల్దార్ సైదులు, ఎంపీడీవో తాటిపాముల జస్వంత్ కుమార్, కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా పార్టీ నాయకులు జొన్నలగడ్డ రవికుమార్, జూకూరి గోపాల్ రావు, హఫీజ్దీన్, బొల్లంపల్లి సుధాకర్ రెడ్డి మాదాసు ఉపేందర్ రావు గారి వీరభద్రం పాలేరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టి శ్రీనివాసరెడ్డి, కంచర్ల జీవన్ రెడ్డి, సర్పంచులు హాళావతు వీరయ్య, బానోతు నాగేశ్వరరావు, దాట్ల సతీష్ (సలీం) , నాయకులు ఎడవెల్లి పుల్లారెడ్డి, ఎడవెల్లి ఉపేందర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శనివారం రాత్రి బాలిక కిడ్నాప్

- **తెల్లారేసరికి నీటి సంపులో మృతదేహం**

టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : సికింద్రాబాద్‌లోని బొల్లారం పరిధి కౌకూర్‌లో దారుణ ఘటన చోటు చేసుకుంది. శనివారం రాత్రి అపహరణకు గురైన ఆరేళ్ల బాలికను దుండగుడు హత్య చేయడం తీవ్ర కలకలం రేపింది. చిన్నారి కాళ్లు, చేతులు కట్టేసి నీటి సంపులో పడేశాడు. చిన్నారిని వాచ్‌మెన్ చంపి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టారు.

'రూ.20 లక్షల డబ్బులు కావాలి'

పోలీసులు వెల్లడించిన కథనం ప్రకారం, కౌకూర్‌లోని విల్లా ఆర్చిడ్స్ అనే అపార్ట్?మెంట్‌లో రాత్రి 9 గంటల ప్రాంతంలో బాలిక సెల్లార్‌లో ఆడుకుంటుండగా కనిపించకుండా పోయింది. బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడు పాప తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో డబ్బులు సర్దుబాటు చేస్తామని, పాపను అప్పగించాలని ఆ



తల్లిదండ్రులు కోరారు. అనంతరం నిందితుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు.

అర్ధరాత్రి నగరాన్ని జల్లెడ పట్టిన పోలీసులు

నిందితుడు ఫోన్? స్విచ్ ఆఫ్ చేయడంతో ఏం చేయాలో తెలియక చిన్నారి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. వారు వెంటనే ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. సీసీ కెమెరాలో రికార్డైన పుటేజీలో బాలిక వాచ్‌మెన్‌తో పాటు ఉండడాన్ని గుర్తించిన పోలీసులు ముఖ్యమైన ప్రాంతాలతో పాటు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి నిందితుడి కోసం జల్లెడ పట్టారు. పోలీసులు చిన్నారి కోసం వెతుకుతుండగా నీటి సంపులో కాళ్లు, చేతులు కట్టిపడేసిన బాలిక మృతదేహం లభ్యమైంది.

శోక సంద్రంలో బాలిక తల్లిదండ్రులు

అప్పటి వరకు అపహరణకు గురైందనుకున్న తమ పాప మృతి చెందిందని తెలియడంతో బాలిక తల్లిదండ్రులు ఒక్కసారిగా శోక సంద్రంలో మునిగిపోయారు. అక్కడి స్థానికులు దిగ్భ్రాంతికి గురయ్యారు. చిన్నారి మరణ వార్తతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

పాలాభిషేకం చేసిన బి ఆర్ ఎస్ శ్రేణులు



టీ మీడియా, అక్టోబర్ 11 పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలో బిఆర్ఎస్ పట్టణ మండల అధ్యక్షులు వి దిలీప్ కుమార్ రెడ్డి వనం రాములు యాదవ్ ఆధ్వర్యంలో సుభాస్ చౌరస్తాలో దశాబ్ది వేడుకల్లో కేసీఆర్ నిరంజన్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ హరిశంకర్ నాయుడు మన్యం సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రే స్వామి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ విశ్వరూపం బిఆర్ఎస్ నాయకులు వడ్డే ఈశ్వర్ పెద్దింటి వెంకటేష్ రాజశేఖర్ చిన్న ఎల్లారెడ్డి ఎద్దుల సాయినాథ్ పరుశురాం రాజశేఖర్ సాయిరెడ్డి శేఖర్ గౌడ్ వీర బొజా చారి జూదం వెంకటేష్ బాలస్వామి యాదవ్ సహదేవుడు గోపి బాబు మోహన్ మధు గారంగుల శీను నాగిరెడ్డి రామకృష్ణ గోవిందు భారతి శేఖర్ ఆచారి గణేష్ సాయి అచారి సురేష్ రమేష్ కరణ్ కురుమన్న హమాలి సంఘం నాయకులు షకీల్ తదితరులు పాల్గొన్నారు

ఉర్సుకు హాజరైన ఎం ఎల్ ఏ



టీ మీడియా, అక్టోబర్ 11 పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని హజ్రత్ షేక్ అలీషా 40వ ఉర్సు మహోత్సవాలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు ఈ వేడుకల్లో వనపర్తి శాసనసభ్యుడు తూడి మెగారెడ్డి ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక పూజలు ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించారు అనంతరం వనపర్తి శాసనసభ్యుడు తుడి మెగా రెడ్డి మాట్లాడుతూ మతసామ్రాస్యానికి సర్వమత సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల్లో ఐక్యతను శాంతిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు హజ్రత్ షేక్ అలీషా ఆశీస్సులు పట్టణ ప్రజలందరిపై ఉండాలని అందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారుఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి తాటికొండ కృష్ణ చెల్లిమిళ్ళ శివ దయాకర్ రెడ్డి షకీల్ రాములు యాదవ్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ వెంకటేష్ సాగర్ రంజిత్ కుమార్ రణధీర్ రెడ్డిలు పాల్గొన్నారు

భవాని మాత మాల దారణ



టీ మీడియా, అక్టోబర్ 11 పెబ్బేరు:వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి ఆలయంలో దేవి నవ రాత్రుల సందర్భంగా 50 మందికి పైగా భక్తులు చిన్నారులు అమ్మ వారికి ఇష్టమైన ఎరుపు రంగు వస్త్రాలు ధరించి భవాని మాలలు వేసుకొని కఠిన మైన నియమ నిష్ఠలతో దేవి శరన్నవరాత్రుల దీక్ష చేపడతారు పట్టణ ప్రజల క్షేమం కోరి అమ్మవారి అనుగ్రహం కోసం ఈ దీక్షలు చేపడతారు అమ్మవారి ఆలయంలో మాలలతో సందడిగా మారింది.

విశాఖలో భారీగా విదేశీ బంగారం పట్టివేత

- **విలువ రూ.8 కోట్లపైనే**



టి మీడియా , అక్టోబర్ 11, విశాఖ : విశాఖపట్నంలో భారీగా విదేశీ బంగారం పట్టుబడింది. కారులో రహస్యంగా తరలిస్తున్న రూ.8.98 కోట్ల విలువైన 5.83 కిలోల బంగారాన్ని డీఆర్?ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు బంగారం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో జాతీయ రహదారిపై డీఆర్?ఐ అధికారులు నిఘా పెట్టారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దర్ని వెంబడించి విశాఖ వద్ద అదుపులోకి తీసుకున్నారు.కారులో ముందు సీటు పక్కన కాళ్లు పెట్టుకునే స్థలం కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న అరలో బంగారం దాచినట్లు అధికారులు గుర్తించారు. భారత్ -- బంగ్లాదేశ్ సరిహద్దు మీదుగా అక్రమంగా పసిడి తీసుకొచ్చినట్లు దర్యాప్తులో తేలింది. కస్టమ్స్ చట్టం 1962 ప్రకారం విదేశీ బంగారాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్?కు తరలించారు.

జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ అందుబాటులోకి

• -క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి పొంగులేటి



టి మీడియా , అక్టోబర్ 11, ఖమ్మం రూరల్: వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి పొన్నెకల్ వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. పొన్నెకల్ వద్ద రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన పాఠశాల భవన సముదాయ నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర.టీఎస్‌తో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాంగణమంతా కలియతిరుగుతూ వివిధ విభాగాల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. అధికారులు మ్యాప్ ల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి.. నిర్దేశిత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేసేలా సమన్వయంతో పనిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యం

పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడమే ఈ పాఠశాలల ప్రధాన ఉద్దేశమని వివరించారు.ఈ కార్యక్రమంలో...ఐ ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణలో వేసవిని తలపిస్తున్న ఎండలు ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : తెలంగాణలో ఎండలు మండు వేసవిని తలపిస్తుండటంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. పగటిపూట వాతావరణం నిప్పుల కొలిమిలా మారుతోంది. రాత్రి వేళల్లో ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. గాలిలో తేమ శాతం పడిపోవడంతో వేడి తీవ్రత అధికంగా పెరిగింది. ఎండలు వేసవి గుర్తుచేస్తుండటం ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. కొన్ని రోజులుగా ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి తదితర ప్రాంతాల్లో సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదవుతుండటం కలవరపాటుకు గురిచేస్తోంది.శుక్ర, శనివారాల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సాధారణం కన్నా మూడు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమ శాతం 60 నుంచి 70 శాతం మధ్య నమోదు కావాల్సి ఉండగా కొన్నిచోట్ల 50 శాతం కంటే తక్కువగా ఉంటోంది. మైదాన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న చోట గాలి కాలుష్యం వల్ల వేడి పెరుగుతున్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

గాలిలోని తేమ పడిపోవడం

వేసవిలోనూ చల్లని వాతావరణం ఉండే హైదరాబాద్‌లో శుక్రవారం 49 శాతానికి గాలిలోని తేమ పడిపోవడం తీవ్రతకు అద్దం పడుతోంది. రామగుండంలో గాలిలో తేమ శాతం 42, హనుమకొండలో 49, మహబూబ్‌నగర్‌లో 51, నిజామాబాద్‌లో 45, నల్గొండలో 45 శాతం నమోదైంది. రానున్న మరో మూడు రోజుల్లో పెద్దపల్లి, ఖమ్మం, మంచిర్యాల, నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, నిర్మల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, కుమురం భీం ఆసిఫాబాద్, ములుగు, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జగిత్యాల, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో సాధారణం కన్నా అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ జిల్లాలకు ఎల్లో అలెర్ట్? జారీ చేసింది. మరోవైపు నైరుతి రుతుపవనాలు ఒకట్రెండు రోజుల్లో తెలంగాణపై నుంచి పూర్తిగా నిష్క్రమించడం గమనార్హం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రానున్న మూడు రోజుల్లో పలు జిల్లాలకు వాతావరణ శాఖ పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. ఇటువంటి తీవ్రమైన పరిస్థితుల్లో వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తపడాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాగే శరీరంలో నీటి శాతం తగ్గకుండా నిరంతరం మంచినీరు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకుంటూ ఆరోగ్యాలను కాపాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

డ్రగ్స్ నెట్‌వర్క్‌పై పోలీసుల ఉక్కుపాదం

• పరారీలో ఉన్న నిందితుడి అరెస్ట్



టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో :గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్న నెట్‌వర్క్‌పై తెలంగాణ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో ఈగల్ బృందం, హైదరాబాద్ సిటీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి, పరారీలో ఉన్న నిందితుడు కస్టోడియో ఫెర్నాండెస్ అలియాస్ క్రిస్టీని గోవాలో అరెస్టు చేశారు. పంజాగుట్ట డ్రగ్స్ కేసు విచారణలో గోవాతో సంబంధాలు బయటపడటంతో పోలీసులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. నిందితుడు గోవాలో ఉన్నట్లు సమాచారం అందడంతో పక్కా ప్రణాళిక ప్రకారం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

పంజాగుట్ట కేసుతో వెలుగులోకి

గతంలో పంజాగుట్ట పోలీసులు నిర్వహించిన దర్యాప్తులో 13 గ్రాముల ఎండీఎంఏ, 7 గ్రాముల చరస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో భాగంగా డ్రగ్స్ సరఫరా వెనక ఉన్న వ్యక్తులు, వారి మధ్య సంబంధాలు, నగదు లావాదేవీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారా? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.

25 మందికిపైగా వ్యక్తుల వివరాల సేకరణ

నిందితుడి మొబైల్ ఫోన్‌లో హైదరాబాద్‌కు చెందిన పలువురి పేర్లు, ఫోన్ నంబర్లను పోలీసులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న తెలంగాణకు చెందిన 25 మందికి పైగా వ్యక్తుల వివరాలను సేకరించారు. అయితే జాబితాలో పేర్లు ఉన్నంత మాత్రాన వారంతా నేరానికి పాల్పడినట్లు భావించలేమని, వారి పాత్రపై దర్యాప్తు ద్వారా స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

మొబైల్ డేటా, బ్యాంకు లావాదేవీలపై నిఘా

నిందితుడి మొబైల్ ఫోన్ డేటా, బ్యాంకు లావాదేవీలను విశ్లేషిస్తూ పోలీసులు కీలక ఆధారాల కోసం ప్రయత్నిస్తున్నారు. గోవా నుంచి హైదరాబాద్‌కు వచ్చి డ్రగ్స్ సరఫరా చేసి, నగదు వసూలు చేసినట్లు అనుమానిస్తున్న వ్యక్తులను కూడా విచారిస్తున్నారు. డ్రగ్స్ కొనుగోలుదారులు, సరఫరాదారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలు ఈ కేసులో కీలకంగా మారే అవకాశం ఉంది.

ఇతర నగరాలకూ విస్తరించిన దర్యాప్తు

గోవాతో పాటు బెంగళూరు, ముంబయి, దిల్లీ తదితర నగరాల్లోని అనుమానిత సరఫరాదారులు, కొనుగోలుదారుల వివరాలపైనా అధికారులు నిఘా పెట్టారు. ఈ నెట్‌వర్క్ వెనక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించడం, డ్రగ్స్ సరఫరా మార్గాలను ఛేదించడం పోలీసుల లక్ష్యంగా ఉంది. రానున్న రోజుల్లో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు ఇలాంటి అక్రమ సరఫరా వ్యవస్థలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లో పాతాళానికి భూగర్భ జలాలు

గతేడాది కంటే మరింత లోతుకు నీటిమట్టం

టి మీడియా , అక్టోబర్ 11, హైదరాబాద్ బ్యూరో : హైదరాబాద్? మహానగరంలో భూగర్భ జలాల పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసినా భూగర్భజల మట్టాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా, గతేడాదితో పోలిస్తే మరింత లోతుకు పడిపోయాయి. ఈ పరిస్థితి నగరవాసులను కలవరపెడుతోంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో బోర్లు నీరు అందించలేని పరిస్థితులు నెలకొంటుండగా, నీటి అవసరాల కోసం ట్యాంకర్లపై ఆధారపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. రానున్న రోజుల్లో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లో భూగర్భ జలాల పరిస్థితి ఎంతగా దిగజారిందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్ చివరితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భజల మట్టాలు ఏకంగా 6.85 మీటర్ల మేర ఎక్కువ లోతుకు చేరాయి. ఆగస్టుతో పోల్చినా సెప్టెంబర్ చివరికి భూగర్భ జలాలు మరింత తగ్గాయి. ప్రస్తుతం సగటున 11.58 మీటర్ల లోతులో నీటి మట్టాలు నమోదవుతున్నాయి. నగర పరిధిలోని 76 శాతానికిపైగా ప్రాంతాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు పడిపోయాయి. కేవలం 24 శాతం ప్రాంతాల్లో మాత్రమే 10 మీటర్ల లేదా అంతకంటే తక్కువ లోతులో నీరు అందుబాటులో ఉంది. దీంతో బోర్ల ద్వారా నీటిని పొందడం కష్టతరమవుతోంది.

క్యూర్ పరిధిలోనూ తగ్గిన నీటి మట్టాలు

హైదరాబాద్ పట్టణ ప్రాంత అభివృద్ధి పరిధి (క్యూర్)లోని 49 మండలాల్లో వర్షపాతం లోటు భూగర్భజలాలపై ప్రభావం చూపుతోంది. సెప్టెంబరు చివరి నాటికి సాధారణంగా 619 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 457 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. అంటే ఆశించిన



స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాల పునరుద్ధరణకు ఆటంకం ఏర్పడింది. ఆగస్టుతో పోలిస్తే సెప్టెంబరు చివరికి నీటి మట్టాలు మరో 0.38 మీటర్లు తగ్గాయి

ఈ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం

కూకట్‌పల్లి, అమీర్‌పేట, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, కేపీహెచ్‌బీ, కుత్బుల్లాపూర్, సరూర్‌నగర్, జీడిమెట్ల, ఎస్సార్‌నగర్, దుండిగల్, చెంగిచెర్ల, ఫతుల్లాగూడ, హఫీజ్‌పేట, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా తగ్గాయి. ఈ ప్రాంతాల్లో బోర్లపై ఆధారపడే కుటుంబాలు నీటి లభ్యతపై ఆందోళన చెందుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, నివాస సముదాయాల్లోనూ నీటి సరఫరా నిర్వహణ కీలకంగా మారుతోంది.

ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్

భూగర్భ జలాల పతనం ప్రభావం జలమండలి ట్యాంకర్ల బుకింగ్‌లపై స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా అక్టోబర్ మొదటి వారంలో రోజుకు 3,000 నుంచి 3,500 ట్యాంకర్లు బుక్ అవుతుంటాయి. అయితే ప్రస్తుతం ఈ సంఖ్య సగటున 5,500కు చేరింది. కొన్ని రోజుల క్రితం ఏకంగా 6,500 ట్యాంకర్ల వరకు బుకింగ్‌లు నమోదయ్యాయి. దీంతో నీటి అవసరాలు తీర్చుకోవడానికి ట్యాంకర్లపై ఆధారపడే వారి సంఖ్య పెరుగుతోందని అర్థమవుతోంది.

నీటి పాడుపే పరిష్కారం

భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించేందుకు వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, నీటి వృథాను అరికట్టడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. భవనాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలి. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవడంతో పాటు, భూగర్భజలాల పునరుద్ధరణకు ప్రభుత్వ సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి. ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో హైదరాబాద్‌లో నీటి సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.

చిన్న తిరుపతి" నిర్మాణానికి సర్వం సిద్ధం

• భూమి పూజకు భారీగా ఏర్పాట్లు

టి మీడియా , అక్టోబర్ 11, ఖమ్మం ఖమ్మం లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.. చిన్న తిరుపతి కి రంగం సిద్ధమైంది.. ఖమ్మం నగరంలోని అల్లిపురం–కొత్తగూడెం వద్ద తిరుమల తిరుపతి దేవాలయంనుపోలి ఉండే మహా దివ్య ఆలయం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం(ప్రతీఅ ను నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.. కోట్ల రూపాయలతో నిర్మాణం చేస్తున్న ఈ ఆలయానికి సోమవారం మంత్రుల సమక్షంలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామి(చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నారు.అందుకు గాను అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంను నిర్మాణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శంకుస్థాపన మహోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు.యాగశాల, దేవాలయం నిర్మాణం కు కావాల్సిన భూమి పూజా స్థలాన్ని నిర్మాణం చేశారు. ఈ మహోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుడు, శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు, ట్రస్ట్ బోర్డ్ సభ్యులు హాజరవుతున్నారు.

తిరుపతిని పోలి ఉండే దేవాలయం..

తిరుమల తిరుపతి దేవాలయంను పోలి ఉండే విధంగా ఆలయం నిర్మాణాలు, గోపురం, భారీ కేడ్లు, భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక గదులు, మరుగుదోడ్లు, మంచి నీటి సౌకర్యం, స్నానాల కేంద్రాలు, కొలనులు, ప్రత్యేకమైన దేవాలయాలను నిర్మాణం చేస్తున్నారు. ప్రతి రోజు అన్నదానం చేసేందుకు ప్రత్యేక సత్రాలు, సేద తీరడానికి ప్రత్యేక విశ్రాంతి గదులను నిర్మాణం చేస్తున్నారు. వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నారు.